క్లుప్తంగా

నోట్‌బుక్స్, పలకల పంపిణీ



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని రామాలయం పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్ చిన్నారులకు శ్రీరామోజు శ్రీధర్ జ్ఞాపకార్థం సోదరుడు మురళి ఆధ్వర్యంలో 14వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్ చేతుల మీదుగా నోట్‌బుక్స్, పలకలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు అక్రమణపై ఫిర్యాదు



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో గల ఊర చెరువులో ఇటీవల అక్రమణదారులు చెట్లను నరికి వేసి వాటిని కాల్చి చదును చేసి మడులను కట్టి ఆక్రమించుకుని పంటలు పండించడానికి ప్రయత్నం చేస్తున్నారని, రైతులు, గ్రామస్తులు ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని స్థానిక రైతులు ఆరోపించారు. దీంతో బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ జోక్యం చేసుకుని చెరువును సందర్శించి ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజేష్, ఎద్దు సత్యనారాయణ, యాదగిరి, సాంబరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

ఖానాపురం : మహిళా సంఘాలకు సంబంధించిన నగదు చెల్లించడం జరిగిందని, అయినా తనపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కొత్తూరుకు చెందిన పట్టాపురం విజిత బుధవారం ప్రకటనలో తెలిపారు. అకారణంగా తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తన మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఆరోపణలు చేయడం మానుకోవాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో నివేశన స్థలం కోసం బుధవారం చివరి గడువులోగా 885 దరఖాస్తులు స్వీకరించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పట్టణంలో 2.27 ఎకరాలు భూమి ఉండగా.. ఎంపిక ప్రక్రియ ఏ విధంగా ఉంటుందోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

బెల్టు షాపులపై దాడులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలో బెల్ట్‌షాపుల్లో బుధవారం పోలీసులు దాడులు చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కానిస్టేబుల్ బుచ్చయ్య ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తుండగా పిరంగిగడ్డ ప్రాంతంలో కిరాణా షాపులో వ్యాపారి పొడిశెట్టి దయాకర్ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడి వద్ద ఉన్న రూ.6,940 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య ఆధ్వర్యంలో పిరంగిగడ్డ ప్రాంతంలోని తిరుపతి సదానందం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా గుర్తించారు. అతడి వద్ద ఉన్న రూ.5,810 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'తుమ్మచెట్లు అమ్ముకున్నారు'

సంగెం : చెరువు కట్టపై ఉన్న తుమ్మ చెట్లను అమ్ముకున్నారని లోహిత వార్డు సభ్యుడు ల్యాదల్ల రమణ ఆరోపించారు. సర్పంచ్ భర్త నాగినేని జగన్‌మోహన్‌రావు, ఉప సర్పంచ్ కోలా రాజు, కారోబార్ బొమ్మెర రవి ఊర చెరువు కట్టపై గల 20 తుమ్మ చెట్లను వేలం వేసి రూ.56 వేలకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సర్పంచ్‌ను వివరణ కోరగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సమక్షంలోనే తుమ్మ చెట్ల వేలం నిర్వహించామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్‌బీ జిల్లా నాయకుడు బానోత్ పూర్ణచందర్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట ఎంఈఓ కార్యాలయంలో ఏఐఎస్‌బీ నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలన్నారు. నాయకులు పవన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై చేరికలు



నర్సంపేట: పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న పెద్ది స్వప్న

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి జెడ్పీ ఫ్లోర్ లీడర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్క అశోక్, బుర్రి తిరుపతి, జున్నుతుల రాంరెడ్డి, సర్పంచ్ జయ జనార్ధన్, ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, ఎదురబోయిన సాంబయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

గీసుకొండ : గీసుకొండ, సంగెం, ఖిలావరంగల్ మండలాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు భూక్యా వెంకన్న, గుగులోత్ కమల్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, సర్పంచ్‌లు అంకతి నాగేశ్వర్‌రావు, బోడకుంట్ల ప్రకాశ్, కొండ రాధ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ: కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడి చేరిక

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ బీసీసెల్ అధ్యక్షుడు తూముల రాజు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో బుధవారం చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు భూక్యా వీరన్న, నాయకులు పెద్ది తిరుపతిరెడ్డి, రచర్ల నాగరాజు, ఉప్పుల రాజు, కడారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్‌లో..

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని అల్పకాలిక విస్తారక్ కోడు అశోక్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో మేరా బూత్ సబ్ సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కూనమళ్ల పృథ్వీరాజ్ అధ్యక్షతన బుధవారం 161,162, 133బూత్‌లలో బూత్ అధ్యక్షులు, కమిటీ సభ్యులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. బాల్నె జగన్, కొంపెల్లి రాజేందర్, పంజాల రాము, దుగ్యాల సమ్మయ్య, గూడూరు సందీప్, కూనమళ్ల పృథ్వీ, ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పొంచి ఉన్న ప్రమాదం



విద్యుత్ వైర్లకు కర్ర సపోర్టు పెట్టిన రైతులు

రాయపర్తి : మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామం నుంచి పెర్కవేడు, దొనబండ మీదుగా కొత్తూరుకు వెళ్లే రహదారిలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌లను తొలగించారు. స్తంభాలకు బదులు రైతులు కర్రలను సపోర్ట్‌గా విద్యుత్ వైర్లకు ఏర్పాటు చేశారు. ఈ రహదారి కొత్తగా మంజూరి కావడంతో రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే వాహనాల రద్దీ పెరిగింది. ప్రమాదం జరగక ముందే అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

గీసుకొండ : గీసుకొండ-సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)కి తక్కువ ధరకు భూములిచ్చిన రైతులను ప్రభుత్వం మోసం చేసిందని టీడీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి ఆరోపించారు. బుధవారం మండలంలోని గీసుకొండ, కొనాయమాకులలో ఇంటింటికి గన్నోజు కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ ఎకరానికి రూ. 10 లక్షల చొప్పున కొనుగోలు చేసి కంపెనీలకు ఎకరానికి రూ. 70 లక్షలకు అమ్ముతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్నారు. పార్కు కోసం భూములు ఇచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎకరం భూమి ఇస్తే వంద గజాల నివాస స్థలం ఇస్తామన్న ప్రభుత్వ హామీ నెరవేరలేదన్నారు. బీసీ బిడ్డగా తనకు అవకాశం ఇవ్వాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. నాయకులు గూడ సంపత్‌రెడ్డి, కేదాసి స్వామి, సాంబరెడ్డి, పరుషరాములు, నియోజకవర్గంలోని మండలాల నాయకులు పాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను తరలించొద్దు



బస్సును తనిఖీ చేస్తున్న పెట్రోలింగ్ సిబ్బంది

వర్ధన్నపేట : స్కూల్ బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తీసుకు పోవద్దని వర్ధన్నపేట పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. శ్రీచైతన్య స్కూల్ బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతుండగా పెట్రోలింగ్ సిబ్బంది బస్సును మున్సిపల్ పరిధిలోని డీసీ తండా వద్ద నిలిపి తనిఖీ చేశారు. నిబంధనలు పాటించడం లేదని పరిమితి కంటే మూడు రేట్లు ఎక్కువగా విద్యార్థులను తీసుకెళ్లడం గుర్తించామన్నారు. దీనిపై డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇవ్వగా బస్సులు మరమ్మతులు ఉండడం వల్ల ఎక్కువ మందిని తీసుకెళ్తున్నట్లు వివరించారు.

70 ఏళ్ల కలకు 'పట్టా'భిషేకం

- మంగళవారిపేట రైతులకు అందనున్న పోడు పట్టాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఖానాపురం : రైతులు అనేక ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నారు.. కానీ వారికి అండగా నిలిచిన వారు లేరు.. ఎన్ని ప్రభుత్వాలు మారినా సాకారం లభించలేదు.. సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.. తమను ఆదుకునే వారే కరువయ్యారా..అంటూ ఆందోళన చెందుతూనే వచ్చారు.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే వచ్చారు. చివరికి రైతుల కలలు నెరవేరి.. త్వరలో గిరిజన రైతులకు పోడు పట్టాలు అందనున్నాయి.. ఖానాపురం మండలంలోని మంగళవారిపేట పరిధిలో గల సర్వే నం 22/19లో 1,300 ఎకరాలు, సర్వే నంబర్ 57నుంచి 115లలో 900 ఎకరాల భూమి ఉంది. దీనిని మంగళవారిపేట, నాజీతండా, బోటిమీదితండా, భద్రుతండా, కొడ్డిమాటుతండా, వేపచెట్టు తండాలకు చెందిన గిరిజన, గిరిజనేతర రైతులు సుమారు గత 70 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారు. నాటి నుంచి అనేక ఆటంకాలను ఎదుర్కొంటూ భూములను కాపాడుకొని పంటల సాగు చేస్తూ వస్తున్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతులకు పట్టాలు మాత్రం రాలేదు. ఈ క్రమంలో నర్సంపేట ఎమ్మెల్యేగా గెలిచిన పెద్ది సుదర్శన్‌రెడ్డి హక్కులు కల్పించిన తర్వాతనే మళ్లీ మీ ముందుకు వస్తానంటూ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వడానికి సర్వేలు చేయించడంతో ఇందులో ఆరు జీపీల పరిధిలో ఉన్న రైతాంగానికి సైతం హక్కులు కల్పించడానికి సర్వేలు చేయించారు. మంగళవారిపేటలో 31, భద్రుతండాలో 162, నాజీతండాలో 153, బోటిమీదితండాలో 72, కొడ్డిమాటుతండాలో 104, వేపచెట్టుతండాలో 188 మందికి పట్టాలు మంజూరయ్యాయి. దీంతో రైతాంగంలో సంబరాలు వ్యక్తమవుతున్నాయి. 70ఏళ్ల కలకు పట్టాభిషేకం లభించడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గిరిజనేతర రైతులకు సైతం హక్కులు కల్పించే యోచనలో ప్రభుత్వం ఉండటంతో కలలకు సాకారం లభించనుంది.

నేటినుంచి జీపీ కార్మికుల సమ్మె

రాయపర్తి : రాష్ట్రవ్యాప్తంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేటినుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఉప్పలయ్య తెలిపారు. బుధవారం మండలంలోని మైలారంలో గ్రామపంచాయతీ భవనానికి సమ్మెకు సంబంధించిన పోస్టర్‌లను అతికించినట్లు తెలిపారు. నేటి సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీకి యత్నం

శాయంపేట : శాయంపేటలోని రైతు వేదికల్లోని వ్యవసాయ విస్తరణ అధికారి చాంబర్‌లో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి వస్తువులు దొంగతనం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి స్టెల్లా చాంబర్‌లో ఉన్న గ్లాస్ కిటికీ ఆటోమెటిక్ లాక్ పనిచేయకపోవడంతో, ఒక పక్క గ్లాస్ డోర్, మరోపక్క మెష్ జాలివేసి లాక్ చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఏఈఓ రైతువేదిక వద్దకు విధులకు హాజరుకాగా ఆమె చాంబర్‌లోని కిటికీ మెష్ జాలి కట్ చేసి కనిపించింది. బీరువా తలుపులు పగలగొట్టడానికి యత్నం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

ఆత్మకూరు : గ్రామాల్లో మొక్కల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. త్వరలో ఇంటింటికీ మొక్కల పంపిణీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రహదారులకు ఇరువైపు మొక్కలు నాటాలని తెలిపారు. పాఠశాలల్లో, కాలనీలో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, కార్యదర్శులు రాజేందర్, యాదగిరి, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి, క్రాంతికుమార్, సతీష్, మోహన్‌రావు, సంపూర్ణ, సుజన, సంధ్య, అనూష, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తేదీని ప్రకటించాలి

పర్వతగిరి : వరంగల్‌కు విచ్చేస్తున్న ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టే తేదీని ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సామాజిక సమానత్వం సాధించడమే ఆశయంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం గత 29సంవత్సరాలుగా చేస్తుందన్నారు.మహాసభకు మాదిగ, ఉప కులాలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రాల ఆవిష్కరణ

దుగ్గొండి : ఈనెల 7న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ముద్రించిన పోస్టర్‌లను ఆ సంఘం నాయకులు మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ మాట్లాడారు. దేశంలో బీఆర్ అంబేడ్కర్ తర్వాత ఉద్యమం నడిపిన ఘనత మంద కృష్ణమాదిగకే దక్కుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుర్రి సతీష్, సందే కార్తీక్, కరుణాకర్, చైతన్య, పర్లపెల్లి బాబు, కొలగాని రవి, దీపక్ , గణేష్, రాజేష్ పాల్గొన్నారు.



దుగ్గొండి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సభను విజయవంతం చేయాలి

రాయపర్తి : ఈనెల 7న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారపు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వశపాక కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బురహాన్‌పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మహాసభకు సంబంధించిన కరపత్రాలను పంచినట్లు తెలిపారు.

వర్ధన్నపేటలో ప్రధాని సెక్యూరిటీ కాన్వాయ్

వర్ధన్నపేట : ఈ నెల 8న ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ పర్యటన సందర్భంగా ఆయన మూడు సెక్యూరిటీ వాహనాలు బుధవారం వర్ధన్నపేట పట్టణం గుండా ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు వెళ్తుండగా పట్టణ వాసులు ఆసక్తిగా తిలకించారు. ఈ కాన్వాయ్ వెంట స్థానిక పోలీస్ వాహనం సైతం ఉంది.

ఆర్‌పీఐ ఎన్నికల మేనిఫెస్టో విడుదల



ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోను బుధవారం ఆ పార్టీ నాయకులు బుధవారం విడుదల చేశారు. ఉచిత హామీలు ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూస్తున్న రాజకీయ నాయకులకు గుణపాఠం చెప్పాలని ఆర్‌పీఐ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య, తెలంగాణ మాల మహానాడు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆర్‌పీఐ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు జన్నవరం లక్ష్మి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టో రాజ్యాంగ హక్కులను అమలు చేస్తూ ప్రజలకు అవసరమైన విషయాలను పొందుపర్చడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక ప్రజా సంఘాల మైనార్టీ వర్గాలతో కలిసి పని చేయాలని పేర్కొన్నారు. నాయకులు గాదె రాములు, గుగులోత్ సోని, పోలేపాక అజయ్, అబ్రహం భూక్యా అనసూర్య, చిలుముల్ల పుష్ప పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు



చెన్నారావుపేట: ఎంపిక పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం సరళ, ఉపాధ్యాయులు



దుగ్గొండిలో..



పర్వతగిరి: ఎంపిక చేస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ఫ్లోరెన్స్ అన్నారు. ఈ మేరకు మండలంలోని జల్లి హైస్కూల్‌లో స్పోర్ట్స్ స్కూల్ మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారని అన్నారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, రవీందర్, కమలలు నిర్వహించారని అన్నారు. ఉపాధ్యాయులు, సురేందర్ గౌడ్, జగన్‌మోహన్, కుమారస్వామి, ఇంద్రారెడ్డి, ఈర్య, మహేందర్, సురేష్‌కుమార్, భద్రు, వెంకన్న, యాకయ్య, సౌమ్య, దేవి, రోజా పుష్పం, సీఆర్‌పీ శిల్ప ఉన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : స్పోర్ట్స్ స్కూల్‌ల్లో అడ్మిషన్ల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలను మండలంలోని గిర్నిబావి పూలే విద్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈనెల 11న ఓ సీటీ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు స్వప్న, లావణ్య, ఐలయ్య, నరేష్, సతీష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి : తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4, 5తరగతిలో విద్యార్థుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని మండల నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ హైస్కూల్‌లో విద్యార్థుల ఎంపిక పరీక్షలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎండి.జలీల్, కరస్పాండెంట్ ఆర్.అశోకచారి, హెచ్‌ఎం కె.శ్రీనివాస్, మండల వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, రవీన, కుమార్, లింగమూర్తి, సురేష్, రమేష్, రాజు, వేణు పాల్గొన్నారు.

'నాయకత్వ లోపంతోనే బలహీనం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గీసుకొండ : పరకాల నియోజకవర్గంతో పాటు గీసుకొండ మండలంలో పార్టీని బలోపేతం చేసే నాయకత్వం లేకపోవడం వల్లే ఎంపీపీ భీమగాని సౌజన్యపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో పాటు ఇద్దరు కాంగ్రెస్ ఎంపీటీసీలు ప్లేటు ఫిరాయించారని కాంగ్రెస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. బుధవారం మండలంలోని కోటగండి వద్ద విలేకరుల సమావేశంలో కొమ్మాల ఎంపీటీసీ మణిగోపాల్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ రహీం, మండల ప్రధాన కార్యదర్శి అప్పని కరుణాకర్, పలువురు నాయకులు మాట్లాడారు. పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అలసత్వం వల్లే పార్టీ బలహీన పడుతోందని, పార్టీనుంచి చేజారుతున్న వారిని రక్షించుకునేందుకు ఆయన ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నామన్నారు. మండల నాయకులు నాగరబోయిన సారంగం, అమిరిశెట్టి రాజు, నాగారపు స్వామి, మర్రి క్రాంతి కుమార్, వాంకుడోత్ చెన్లా నాయక్, కొండా మధు, సిరిసె రాజు తదితరులు పాల్గొన్నారు.


బస్సు సౌకర్యం కల్పించాలి



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వర్ధన్నపేట : ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని, బస్‌పాస్‌లు ఉచితంగా ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షుడు కళ్యాణ్ అధ్యక్షతన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ.. వివిధ గ్రామాల నుంచి అనేక మంది విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో వస్తూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తూరు, గన్నారం, బురహాన్‌పల్లి, కొండూరు, తిరుమలయపల్లి, దమ్మన్నపేట, కొత్తపల్లి, బంధనపల్లి, ల్యాబర్తి తదితర గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు అనేక అవస్థలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోల కోసం ఎదురుచూడడం వల్ల సమయానికి కళాశాలకు వెళ్లలేక పోతున్నామని, తరగతులకు హాజరు కాలేకపోతున్నారన్నారు. ఉదయం, సాయంత్రం కళాశాలల సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని ఉచితంగా బస్ పాసులు అందించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విష్ణు, దిలీప్, రాజు, రంజిత్, బన్నీ, అక్షయ, దివ్య, మానస, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పాములు పట్టడంలో దిట్ట



బాటిల్‌లో బంధించిన పామును చూపిస్తున్న రమేష్

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన పిట్టల రమేష్ పాములు పట్టడంలో దిట్ట. ఎవరైనా సమాచారం అందిస్తే అక్కడకు చేరుకుని పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేస్తాడు. డబ్బులు తీసుకోకుండా పదేళ్లలో రమేష్ సుమారు 400 పాములు పట్టి అటవీ ప్రాంతంలో వదిలేశాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం నాగుపామును పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాటేసింది. ఎంజీఎంలో 15 రోజుల పాటు చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకున్నాడు. గోడలు, రాళ్లలో దూరిన పామును తోక లాగి ఇట్టే పట్టేస్తాడు. జనాలను చూసి పాము పరుగెడుతుంటే దగ్గరకు వెళ్లి కొద్దిసేపు దానితో ఆట ఆడుతూ పట్టుకుంటాడు.